


www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY




సంపుటి: 01 | సంచిక: 227 | హైదరాబాద్ | సోమవారం | 08-12-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు



## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు

# సర్వం సిద్ధం

**అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్వహణకు పూర్తిఅయిన ఏర్పాట్లు**

**భారీగా పెట్టుబడులకు ఆహ్వానం, ప్రభుత్వ సహకారంపై చర్చ**

**హాజరుకానున్న 44కు పైగా దేశాల ప్రతినిధులు**

**రేపు మధ్యాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వ వ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్ లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు ...మిగతా 2లో

### గ్లోబల్ సమ్మిట్ కు విద్యుత్ శాఖ

## విస్తృత ఏర్పాట్లు

**2 కిలో మీటర్ల మేర అండర్ గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు**

**అదనంగా 5 ట్రాన్స్ ఫార్మర్లు...**

**సదస్సు ముగిసే వరకు దాదాపు 150 మంది సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ**

02



## గోవాలో ఘోర

# అగ్నిప్రమాదం

## 25 మంది సజీవదహనం

**'బాలీవుడ్ బ్యాంగర్ నైట్' కార్యక్రమంలో ఘటన**

**ఇరుకుమార్గంతో బయటకు రాలేక ఇబ్బంది**

**డ్యాన్స్ ఫ్లోర్‌పై సుమారు 100**

**క్షణాల్లోనే విస్తరించిన మంటలు, కమ్ముకున్న పొగ**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** గోవా రాష్ట్రంలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న ప్రముఖ నైట్‌క్లబ్ 'బర్చ్ బై రోమియో లేన్'లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదం ఊహించిన దానికంటే తీవ్రమైన విషాదానికి దారితీసింది. ఒక్కసారిగా చెలరేగిన మంటల్లో 25 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరణించిన వారిలో నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బంది ఉన్నట్లు ధృవీకరించబడింది. మరో ఏడుగురి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఘటన సమయంలో క్లబ్‌లో 'బాలీవుడ్ బ్యాంగర్ నైట్' నిర్వహిస్తున్నారు. షోలే సినిమాలోని 'మెహబూబా ఓ మెహబూబా' పాటకు ఓ డ్యాన్సర్ బెల్లీ డ్యాన్స్ చేస్తుండగా బ్యాండ్ సంగీతం, ప్రేక్షకుల హర్షధ్వానాలతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఇదే సమయంలో సీలింగ్ వైపు నుంచి మంటలు ఎగసిపడ్డాయి. సిబ్బంది మొదట దానిని పెద్ద ప్రమాదంగా భావించకుండా నిర్లక్ష్యం చూపారనే ...మిగతా 2లో

---

### స్మృతి మంధాన, పలాశ్

## వివాహం రద్దు

**ఇన్ స్టాలో పోస్ట్ చేసిన స్మృతి**


**సేమ్ పోస్ట్ చేసిన పలాశ్ ముచ్చల్**

**వ్యక్తిగత కారణాలతో నిర్ణయం**

**పుకార్లు నమ్మొద్దంటూ సూచనలు**

**తప్పుడు ప్రచారం చేస్తే**

**లీగల్ యాక్షన్ అంటూ హెచ్చరికలు**



02

### సర్కారు మారినా

## పాలన మారలేదు

హస్తం పార్టీలోనూ అవినీతి

ఒక్క హామీ కూడా అమలు చేయలేదు

2 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైంది?

సన్నబియ్యం, ఉచిత బస్సు ఇస్తే సరిపోతుందా?

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



02

## కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం

**54 విమానాలు రద్దు**

**మొత్తం 115 విమానాలపై ప్రభావం**

**కొనసాగుతున్న ప్రయాణికుల కష్టాలు**

**ధరలు తగ్గించాలంటూ కేంద్రం సూచన**

**పట్టించుకోని విమానయాన సంస్థలు**




03

### జాతి కోసం.. జనహితం కోసం.. గొప్ప కలలు కనాలంటే

## ధైర్యం ఉండాలి..

**గ్లోబల్ సమ్మిట్‌కు ముస్తాబైన హైదరాబాద్**

**కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై సీఎం రేవంత్ ట్వీట్**

**సంక్షేమం నుంచి భవిష్యత్ విజన్ వరకు ప్రభుత్వ ప్రస్థానం**

**2047 లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ ప్రణాళికలు**



### అమెరికా కాన్సులేట్ రోడ్డుకు

## డొనాల్డ్ ట్రంప్ పేరు

గ్లోబల్ సమ్మిట్ వేళ కీలక నిర్ణయాలు

ట్రంప్, గూగుల్ పేర్లతో వీధులు

విప్రో, మైక్రోసాఫ్ట్ పేర్లపైనా భవిష్యత్తులో పరిశీలన

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ప్రభుత్వ ప్రకటన

రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

03

### స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో

## విచిత్ర సంఘటన

**ఎస్టీ జనాభా లేకపోయినా**

**ఎస్టీ రిజర్వేషన్ కేటాయింపు**

**సర్పంచ్, మూడు వార్డులకు నామినేషన్లు లేవు**

**ఐదు వార్డులకు మాత్రమే ఎన్నికలు**

**రీనోటిఫికేషన్ కోరుతున్న గ్రామస్తులు**

03

### ఒకవైపు వడ్డీలు కడుతూ సంక్షేమ పథకాలు

## అమలు చేస్తున్నాం



02

**బీజేపీ మహాధర్నాపై టీపీసీసీ చీఫ్ ఘాటు వ్యాఖ్యలు**

**జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం**

**రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం అప్పగించారు**

**వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ అమలు, మూడేళ్లలో హామీలు పూర్తి : మహేష్ గౌడ్**

మెస్సీ, సీఎం రేవంత్ మ్యాచ్ కోసం

## సిద్ధమవుతున్న ఉప్పల్

**డిసెంబర్ 13న ఉప్పల్‌లో మెస్సీ మ్యాచ్**

**సీఎం రేవంత్ నేతృత్వంలో ఒక జట్టు**

**మాస్టర్ క్లాస్, సాకర్ క్యాంప్ ఆకర్షణ**

**కాన్సర్ట్‌తో ఫ్యాన్స్‌కు ఫుల్ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్**



03

# గోవాలో ఘోర అగ్నిప్రమాదం



మొదటిపేజీ తరువాయి

ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే క్షణాల్లోనే మంట విస్తరించి, దట్టమైన పొగతో మొత్తం హాల్ నిండిపోయింది. వెంటనే సంగీతం ఆపి సందర్శకులకు బయటకు వెళ్లాలని సూచించినా, చిన్న తలుపులు, ఇరుకు మార్గాల కారణంగా చాలామంది బయటికి రాలేకపోయారు. కొందరు గ్రౌండ్‌ఫ్లోర్‌లోని కిచెన్ ప్రాంతంలోకి పరిగెత్తడంతో అక్కడే చిక్కుకుపోయారు.

**ప్రమాదం ఎలా జరిగింది?**

ప్రాథమిక సమాచారం ప్రకారం మంటలు మొదటి అంతస్తు నుంచి ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో డ్యాన్స్ ఫ్లోర్‌పై సుమారు 100 మంది ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. మొదట గ్యాస్ సిలిండర్ పేలుడు కారణమై ఉండొచ్చని అనుమానించినా, ప్రత్యక్షసాక్షులు మాత్రం డ్యాన్సింగ్ రూమ్‌లోనే మంటలు ప్రారంభమైనట్లు చెబుతున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

**పర్యాటక నగరాన్ని కలవరపరిచిన ఘటన**

అర్పోరాలో పర్యాటకుల రద్దీ ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో జరిగిన భారీ ప్రమాదం స్థానికులను, పర్యాటకులను తీవ్రంగా కలవరపరిచింది. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మృతుల్లో ఝార్ఖండ్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారు. గోవా మెడికల్ కాలేజీలో పోస్టుమార్టం పూర్తయింది. మృతదేహాలను స్వస్థలాలకు తరలించడానికి నైట్‌క్లబ్ యజమాన్యమే చర్యలు తీసుకోవాలని బాధితుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

**వైరల్ వీడియోలు**

ఘటన చోటుచేసుకున్న సమయంలో తీసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మంటలు వేగంగా విస్తరించడంతో ప్రజలు అల్లకల్లోలంగా పరుగులు తీస్తున్న దృశ్యాలు, సిబ్బంది గందరగోళం వాటిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఇంత భారీ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. గోవా పర్యాటక వాతావరణాన్ని ఈ ఘటన తీవ్ర విషాదంలోకి నెట్టింది.

# సర్కారు మారినా పాలన మారలేదు

- **హస్తం పార్టీలోనూ అవినీతి**
- **ఒక్క హామీ కూడా అమలు చేయలేదు**
- **2 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైంది?**
- **సన్నబియ్యం, ఉచిత బస్సు ఇస్తే సరిపోతుందా?**
- **కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో పదేళ్ల పాటు కొనసాగిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాలన వల్ల తెలంగాణ అప్పుల భారంలో కూరుకుపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేయని ఎన్నికల హామీలకు సంబంధించిన ఛార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన కిషన్‌రెడ్డి, ''పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబ నియంతృత్వం, అధికార దుర్వినియోగం, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం మాత్రమే చూశాం. ఆ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేశారు. కానీ హస్తం పార్టీ కూడా అదే దారిలో నడుస్తోంది'' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో ఇప్పటివరకు ఉచిత మహిళా బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ తప్ప మిగతా హామీలు ఏవీ అమలు కాలేదని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ముఖ్యంగా, ఎన్నికల సమయంలో భారీ ఎత్తున ప్రచారం చేసిన *2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ* ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని నిలదీశారు. 'బీఆర్ఎస్ గులాబీ జెండా పోయి చేయి గుర్తు వచ్చింది అంతే. రాష్ట్రంలో దోపిడీ, అవినీతి మాత్రం ఆగలేదు. ఏ వర్గం ప్రజల జీవనంలోనూ గణనీయమైన మార్పు కనిపించడం లేదు. అంతేకాదు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నేతలుగా ఉన్న పది మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరడం కూడా రెండు పార్టీల మధ్య ఉన్న నిజస్వరూపాన్ని బయటపెడుతోంది'' అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేయడానికి కూడా భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కుటుంబపార్టీలే, అవి అధికారం కోసం అక్రమాలకు పెద్దపీట వేస్తాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# దేహ ధారుడ్యానికి, ఆత్మరక్షణకు కరాటే క్రీడ చాలా అవసరం

- **పట్టాభిరాం**

**విశాఖపట్నం,డిసెంబర్ 7(సిద్దిపేట పవర్):**



దేహ ధారుడ్యానికి, ఆత్మరక్షణకు కరాటే క్రీడ చాలా అవసరమని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం పేర్కొన్నారు. ఆదివారం ఉషోదయ జంక్షన్ వద్ద గల తన కార్యాలయంలో ఛాంపియన్స్ కప్ 2.0 నేషనల్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలలో విజేతలైన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. షాడో ఫైటర్స్ కరాటే డోజో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలను సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాటా, క్యూమిటే విభాగాల్లో విద్యార్థులు అద్భుతంగా మెరిసి డోజోకు గౌరవం తీసుకువచ్చా రన్నారు. విజేతలందరికీ షాడో ఫైటర్స్ కరాటే డోజో తరఫున శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ వారి వెంట నిలిచిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్లు ఫౌండర్ ఆఫ్ షాడో ఫైటర్స్ కరాటే డోజో సెకండ్ డాన్ బ్లాక్ బెల్ట్ కె.గురునాయుడు, ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ ఎంటివి ప్రసాద్, టి.మోహన్ సాయి చరణ్, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

తరలివస్తున్నారు.

నేటి మధ్యాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్ లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తదితరులు ప్రసంగించనున్నారు.

మధ్యాహ్నం రెండున్నర గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు.

రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు.

వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీ తో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, 3D ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్ ఈడీ స్క్రీన్స్ తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజుల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.



# గ్లోబెల్ సమ్మిట్ కు విద్యుత్ శాఖ విస్తృత ఏర్పాట్లు

- **2 కిలో మీటర్ల మేర అండర్ గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటు**
- **అదనంగా 5 ట్రాన్స్ ఫార్మర్లు ... ఒక మొబైల్ డిటిఆర్**
- **సదస్సు ముగిసే వరకు దాదాపు 150 మంది సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 వ తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ సజావుగా సాగేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు గాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసిందని ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ తెలిపారు. 33 /11 కేవీ మీర్ ఖాన్ పేట్ సబ్ స్టేషన్ నుండి సదస్సు జరిగే ప్రాంతానికి ప్రత్యేకంగా రెండు కిలో మీటర్ల నిడివి కలిగిన డబుల్ సర్క్యూట్ అండర్ గ్రౌండ్ కేబుల్ ను ఏర్పాటు చేసారు. ఒక 100 కేవీఏ, రెండు 160 కేవీఏ, రెండు 315 కేవీఏ కెపాసిటీలు కలిగిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లను ప్రాంగణం లోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసారు. దీనికి తోడు ఒక 315 కేవీఏ కెపాసిటీ కలిగిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ ను కూడా అందుబాటులో ఉంచారు. సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ డా. నర్సింహులుని సదస్సు కు ఇంచార్జి గా నియమించడం జరిగింది. దీనికి తోడు దాదాపు 150 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది రేపు శనివారం నుండి సదస్సు ముగిసే వరకు ఆ ప్రాంతంలో సరఫరా తీరును పర్యవేక్షిస్తుంటారని సీఎండీ తెలిపారు. శుక్రవారం ఉదయం చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ లో సీఎండీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబెల్ సమ్మిట్ కు దేశ, విదేశాలకు సంబంధించిన పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారని విద్యుత్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ, విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ సర్కిళ్ల సిబ్బంది తప్పనిసరిగా సేఫ్టీ జాకెట్లు ధరించాలని, క్విక్ రెస్పాన్స్ టీం వాహనాలు, ఇతర పరికరాలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# స్మృతి మంధాన, పలాశ్ వివాహం రద్దు

- **ఇన్ స్టాలో పోస్ట్ చేసిన స్మృతి**
- **సేమ్ పోస్ట్ చేసిన పలాశ్ ముచ్చల్**
- **వ్యక్తిగత కారణాలతో నిర్ణయం**
- **పుకార్లు నమ్మొద్దంటూ సూచనలు**
- **తప్పడు ప్రచారం చేస్తే లీగల్ యాక్షన్ అంటూ హెచ్చరికలు**

**ముంబాయి, (సిద్దిపేట పవర్):**



భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన తన వివాహాన్ని రద్దు చేసిన విషయాన్ని అధికారికంగా ప్రకటించడంతో క్రికెట్ వర్గాల్లో, అభిమానుల్లో కలకలం రేగింది. నవంబర్ 23న సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్‌తో ఆమె వివాహం జరగాల్సి ఉండగా, అనుకోని కారణాల వల్ల వాయిదా పడినట్లు గతంలో వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు మంధాన స్వయంగా పెళ్లి పూర్తిగా రద్దయిందని వెల్లడించడం పెద్ద సంచలనంగా మారింది.

**స్మృతి మంధాన స్పష్టీకరణ**

ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా మంధాన తన నిర్ణయాన్ని వెల్లడిస్తూ ఇలా చెప్పింది. గత కొద్ది వారాలుగా తన వ్యక్తిగత జీవితం చుట్టూ వచ్చిన ఊహాగానాలు తాను గమనిస్తున్నానని పేర్కొంది. సాధారణంగా వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచాలని అనుకునే తనలాంటి వ్యక్తికి ఇలాంటి సందర్భాల్లో మాట్లాడటం తప్పనిసరైందని స్పష్టం చేసింది. ''వివాహం రద్దయిందని ఇక్కడితో స్పష్టంచేస్తున్నా. ఈ విషయాన్ని మరింత లాగిపెట్టకుండా ఇరువైపులా గోప్యతను గౌరవించాలని అందరినీ కోరుతున్నా. భారత క్రికెట్‌కు సేవ చేసే దిశగా ముందుకు సాగుతా. దేశం కోసం మరిన్ని మ్యాచ్‌లు ఆడి, ట్రోఫీలు గెలవడమే నా లక్ష్యం'' అని ఆమె పేర్కొంది. అనవసర చర్చలు, ఊహాగానాలు తన కుటుంబాన్ని కూడా ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఈ వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె చెప్పినట్లుగా తెలుస్తోంది.

**పలాశ్ ముచ్చల్ భావోద్వేగ ప్రతిస్పందన**

ఇక పలాశ్ ముచ్చల్ కూడా తన ఇన్‌స్టా స్టోరీలో స్పందించారు. ''నేను జీవితంలో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. నా వ్యక్తిగత సంబంధం ఇప్పుడు ముగిసిపోయింది. ఆధారంలేని వదంతులు, అపోహలు నన్ను తీవ్రంగా బాధిస్తున్నాయి. ఈ కాలం నా జీవితంలో అత్యంత క్లిష్టమైన దశ'' అని పేర్కొన్నారు. అలాగే కొందరు వ్యక్తులు నిజం చెక్ చేయకుండా వదంతులను విశ్వసించడం బాధాకరమని, ఈ సందర్భంలో సమాజం ఒక్కసారి ఆలోచించి మాటల ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో గ్రహించాలని సూచించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తమ లీగల్ టీమ్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తనకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.


**వివాహ రద్దు చుట్టూ చర్చలు**

క్రీడా వర్గాల్లో ప్రముఖుల వ్యక్తిగత జీవితం ఎప్పటికప్పుడు చర్చకు వస్తుంది. మంధానపలాశ్ పెళ్లి రద్దు విషయమూ అదే స్థాయిలో సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. అయితే ఇద్దరూ బాధ్యతాయుతంగా ప్రతిస్పందిస్తూ, పరస్పర గౌరవాన్ని కొనసాగిస్తూ ముందుకు వెళ్లడం ప్రశంసనీయమని అనేక మంది అభిప్రాయపడుతున్నారు. స్మృతి మంధాన ప్రస్తుతం భారత జట్టులో ప్రధాన స్థంభంగా కొనసాగుతోంది. టీమ్ ఇండియా కోసం కీలక మ్యాచ్‌లు, సిరీస్‌లు రాబోతున్న నేపథ్యంలో ఆమె పూర్తిగా క్రికెట్‌పైనే దృష్టి సారించనున్నట్లు అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# ఒకవైపు వడ్డీలు కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం

- **బీజేపీ మహాధర్నాపై టీపీసీసీ చీఫ్ ఘాటు వ్యాఖ్యలు**
- **జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం**
- **రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం అప్పగించారు**
- **వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ అమలు, మూడేళ్లలో హామీలు పూర్తి : మహేష్ గౌడ్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



బీజేపీ చేపట్టిన మహాధర్నాపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ విషయమై మాట్లాడే అర్హత బీజేపీకి, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రానికి కిషన్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల మెప్పు పొందిందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే స్పష్టమైన ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రజల్లో నమ్మకం కోల్పోయిన బీజేపీ నేతలు ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కించుకోలేని స్థితిలో ఉందని, అలాంటి పరిస్థితిలో ఉన్న కిషన్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం గర్వంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనుందని, ప్రజల మద్దతుతో ప్రజల ముందే గర్వంగా నిలబడుతున్నామని చెప్పారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకాల వల్ల రూ. 8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. అయినప్పటికీ ఒకవైపు అప్పులపై వడ్డీలు చెల్లిస్తూనే, మరోవైపు ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ రాబోయే మూడేళ్లలో తప్పకుండా నెరవేర్చుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో పాటు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# రంగంలోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్.. డ్రోన్ కెమెరాలతో నిఘా

- **రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు భారీ బందోబస్తు**
- **6 వేల మందితో భారీ బందోబస్తు**
- **ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్ 14 నుంచి వేదిక వరకు బందోబస్తు**
- **ఇప్పటికే ప్రజా వేదికను ఆధీనంలో తీసుకున్నాం**
- **సమ్మిట్‌కు వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనుమతిస్తాం.**
- **రాచకొండ సీపీ సుధీర్ బాబు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



హైదరాబాద్‌లో జరగనున్న రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. సమ్మిట్‌ను సురక్షితంగా నిర్వహించేందుకు దాదాపు 6 వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్ బాబు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్ 14 నుంచి సమ్మిట్ ప్రధాన వేదిక వరకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నామని వెల్లడించారు.

సమ్మిట్ వేదికను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి భద్రతా లోటు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

భద్రతా చర్యలలో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలను రంగంలోకి దించారు. ప్రధాన ప్రాంగణం పూర్తిగా ఆక్టోపస్ ఆధీనంలో ఉండనుండగా, ప్రధాన వేదికతో పాటు ఇతర ప్రాంగణాల్లోనూ విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. అన్ని ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌లతో గాలింపులు నిర్వహిస్తున్నారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ గ్లోబల్ సమ్మిట్‌కు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి ప్రధాన వేదిక వరకు డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన వేదిక చుట్టూ నలువైపులా ప్రత్యేక డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా అధునాతన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వందలాది సీసీ కెమెరాల ద్వారా సమ్మిట్ మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటల పాటు నిఘా కొనసాగించనున్నారు. ఎలాంటి అనూహ్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలతో పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని అధికారులు వెల్లడించారు.

### స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో

# విచిత్ర సంఘటన

- **ఎస్టీ జనాభా లేకపోయినా ఎస్టీ రిజర్వేషన్ కేటాయింపు**
- **సర్పంచ్, మూడు వార్డులకు నామినేషన్లు లేవు**
- **ఐదు వార్డులకు మాత్రమే ఎన్నికలు**
- **రీనోటిఫికేషన్ కోరుతున్న గ్రామస్తులు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

వరంగల్ జిల్లా సంగెం మండలం వంజర పల్లి గ్రామంలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది.. గ్రామంలో 375 మంది జనాభా వున్న గ్రామంలో ఎస్టీ జనాభా ఏ ఒక్కరూ లేనప్పటికీ సర్పంచ్, మూడు వార్డు స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్ను ఎన్నికల అధికారులు కేటాయించారు. దీంతో గ్రామంలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేయడానికి ఏ ఒక్కరు లేకపోవడంతో సర్పంచ్ తో పాటు మూడు వార్డు సభ్యులకు నామినేషన్ దాఖలు కాలేదు. ఎన్నికలు కేవలం 5 వార్డులకు మాత్రమే జరగనున్నాయి. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వరంగల్ జిల్లాలోని వంజరపల్లి గ్రామం చర్చనీయాంశంగా మారింది. నలుగురు వార్డు సభ్యులకు బీసీ ఒకటి, 4 ఎస్సీ కేటాయించడం జరిగింది. ఈ స్థానాలకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రామంలో లేని జనాభా కు సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులకు ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడంపై గ్రామస్తులు ఎన్నికల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2018లో గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ వంజనపల్లి గ్రామపంచాయతీ గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి బీసీ రిజర్వేషన్లు కేటాయించారు. ప్రస్తుతం ఎస్టీ రిజర్వేషన్ కేటాయించడంతో గ్రామంలో సర్పంచ్ తో పాటు మూడు వార్డులకు ఎన్నికలు నిలిచిపోయాయి. అధికారులు రిజర్వేషన్ను మార్చి రీనోటిఫికేషన్ ఇస్తే గ్రామంలో సర్పంచ్ తో పాటు మూడు వార్డు సభ్యుల అభ్యర్థులను ఎన్నుకుంటామని గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. రాబోయే రోజుల్లో గ్రామానికి రీ నోటిఫికేషను ఇస్తారా లేదా అధికారులు ఎన్ని నిర్ణయం తీసుకుంటారోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.




# జాతి కోసం.. జనహితం కోసం.. గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి..

- **గ్లోబల్ సమ్మిట్‌కు ముస్తాబైన హైదరాబాద్**
- **కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై సీఎం రేవంత్ ట్వీట్**
- **సంక్షేమం నుంచి భవిష్యత్ విజన్ వరకు ప్రభుత్వ ప్రస్థానం**
- **2047 లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ ప్రణాళికలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. సోమ, మంగళవారాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న ఈ రెండు రోజుల సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవనున్న నేపథ్యంలో, సమ్మిట్ ప్రాంగణంతో పాటు నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా తన సందేశాన్ని అందించారు. 'జాతి కోసం... జనహితం కోసం... గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి... గొప్ప కార్యాలు చేయాలంటే...మహా సంకల్పం కావాలి... సరిగ్గా రెండేళ్ల క్రితం నాకు ఆ ధైర్యం ఇచ్చి... తమ ఓటుతో గెలుపు సంకల్పాన్ని ఇచ్చి... నిండు మనస్సుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ రెండేళ్ల ప్రస్థానంలో... అనునిత్యం అహర్నిశలూ అవని పై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించాను. గత పాలన శిథిలాల కింద కొనఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశాం. రుణభారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపాం. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతు ఇచ్చి అదానీ, అంబానీల లెక్క వ్యాపారరంగంలో నిలిపాం. బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పాం. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేశాం. చదువొక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రం అని నమ్మి... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశాం. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టాం.

స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతున్నాం. "జయ జయహే తెలంగాణ" అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చాం. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500 కే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు.

నేటి అవసరాలు తీర్చి, పేదల సంక్షేమం కూర్చి ఇదే అద్భుతం అని మేం సరిపెట్ట లేదు. స్వతంత్ర భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే సందర్భం 2047 నాటికి మన తెలంగాణ ఎట్లుండాలి... ఎక్కడ ఉండాలో లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేశాం. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్ కు మేం ప్రాణం పోశాం. ప్రపంచ వేదిక పై #TelanganaRising రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. భారత దేశ గ్రోత్



ఇంజిన్ గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం చేశాం. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క. నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి "తెలంగాణ గ్లోబల్ సమ్మిట్" తర్వాత మరో లెక్క.. నిన్న, నేడు, రేపు... మీ ఆశీర్వాదమే నా ఆయుధం.. మీ ప్రేమాభిమానాలే నాకు సర్వం... మీ సహకారమే నాకు సమస్తం.. తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు... ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు... "TELANGANA RISING" కు తిరుగు లేదు.' అని ఆయన ట్విట్టర్ లో పోస్ట్ చేశారు.

### మెస్సీ, సీఎం రేవంత్ మ్యాచ్ కోసం

# సిద్ధమవుతున్న ఉప్పల్

- **డిసెంబర్ 13న ఉప్పల్‌లో మెస్సీ మ్యాచ్**
- **సీఎం రేవంత్ నేతృత్వంలో ఒక జట్టు**
- **మాస్టర్ క్లాస్, సాకర్ క్యాంప్ ఆకర్షణ**
- **కాన్సర్ట్‌తో ఫ్యాన్స్‌కు ఫుల్ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ మహానగరం మరో చారిత్రక ఘట్టానికి వేదిక కాబోతోంది. ఫుట్‌బాల్ ప్రపంచ దిగ్గజం లియోనల్ మెస్సీ భాగస్వామ్యంతో కూడిన ఫ్రెండ్లీ మ్యాచ్ డిసెంబర్ 13న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. ఓవైపు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరుగుతుండగా, మరోవైపు ఈ ఫుట్‌బాల్ ఈవెంట్ నగరానికి మరింత గ్లోబల్ గుర్తింపును తీసుకురానుంది. ముఖ్యంగా, స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జట్టుకు సారథ్యం వహించనుండటంతో ఈ మ్యాచ్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫుట్‌బాల్ అభిమానులు సహా సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సైతం ఈ అద్భుతమైన ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రోగ్రాం వివరాల విషయానికి వస్తే, లియోనల్ మెస్సీ డిసెంబర్ 12వ తేదీ రాత్రి కోల్‌కతా చేరుకుంటారు. ఆ తర్వాత, 13వ తేదీ మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఆయన 200 మంది సిబ్బంది బృందంతో కలిసి హైదరాబాద్‌కు చేరుకుంటారు. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో ఈ ఫ్రెండ్లీ మ్యాచ్‌తో పాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. ఈవెంట్‌లో ప్రధానంగా, వివిధ రంగాల సెలబ్రిటీలతో ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఇందులో రెండు జట్లు తలపడతాయి - ఒక జట్టుకు సీఎం రేవంత్ రెడ్డి, మరో జట్టుకు సాక్షాత్తూ మెస్సీ సారథ్యం వహిస్తారు. ఆట తర్వాత, యువ ప్రతిభావంతులను ప్రోత్సహించే ఉద్దేశంతో మెస్సీ మాస్టర్ క్లాస్ ప్రోగ్రాం నిర్వహిస్తారు. ఇది యంగ్ ఫుట్‌బాలర్స్‌కు ఒక అపురూపమైన అవకాశం. అంతేకాకుండా, పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 25 నిమిషాల పాటు మెస్సీ సాకర్ క్యాంప్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం, స్టేడియంలో పెనాల్టీ షూట్‌అవుట్ నిర్వహణతో పాటు, చివరిగా ప్రేక్షకులను అలరించేందుకు మ్యూజికల్ కాన్సర్ట్ కూడా ఉంటుంది.

ఈ మెస్సీ టూర్ వల్ల ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో సాకర్ (ఫుట్‌బాల్) క్రీడ బాగా అభివృద్ధి చెందుతుందని, యంగ్‌స్టర్స్‌కు సాకర్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ఒక అదనపు విలువగా పరిగణిస్తున్నారు. ఏర్పాట్ల విషయంలో ఎటువంటి లోటు లేకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి, భద్రత, వసతులను అడిగి తెలుసుకున్నారు. అభిమానులు నిర్ణీత సమయం కంటే ముందే స్టేడియంలోకి చేరుకోవాలని ఆయన సూచించారు.




# కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం

- **54 విమానాలు రద్దు**
- **మొత్తం 115 విమానాలపై ప్రభావం**
- **కొనసాగుతున్న ప్రయాణికుల కష్టాలు**
- **ధరలు తగ్గించాలంటూ కేంద్రం సూచన**
- **పట్టించుకోని విమానయాన సంస్థలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. దీని వల్ల దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభం ముఖ్యంగా పైలట్‌ల లభ్యత లోపం, టెక్నికల్ సమస్యలు, వింటర్ షెడ్యూల్ మార్పులు, వాతావరణ సమస్యల వల్ల సంభవించినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 2025లో మొదలైన ఈ సమస్యలు ఇప్పుడు దేశంలోని ప్రధాన ఎయిర్‌పోర్టులను ప్రభావితం చేస్తున్నాయి, ముఖ్యంగా హైదరాబాద్‌లోని శంషాబాద్ (రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్)లో తీవ్రంగా కనిపిస్తున్నాయి.

డిసెంబర్ 7న ఆదివారం కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 54 విమానాలు, ఇక్కడి నుండి వెళ్లాల్సిన 61 విమానాలు రద్దు చేయబడ్డాయి, మొత్తం 115 విమానాలు ప్రభావితమయ్యాయి. ఇది గత నాలుగు రోజుల్లో హైదరాబాద్‌లో జరిగిన మొత్తం కాన్సలేషన్స్ సంఖ్యను 500కు మించిపోయేలా చేసింది. ఇండిగో సర్వీసులు దేశంలోని 60% కంటే ఎక్కువ మార్కెట్ షేర్ కలిగి ఉండటం వల్ల, ఈ రద్దులు ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి ఇతర ఎయిర్‌పోర్టుల్లో కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉదాహరణకు, డిసెంబర్ 5న హైదరాబాద్‌లో 92 విమానాలు రద్దు కాగా, డిసెంబర్ 6న 69 విమానాలు ప్రభావితమయ్యాయి. దీని వల్ల ఎయిర్‌పోర్టుల్లో భారీ రద్దీ ఏర్పడుతోంది, ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది, కొందరు రాత్రంతా ఎయిర్‌పోర్టుల్లోనే గడపాల్సి వచ్చింది. కొందరు ప్రయాణికులు తమ బ్యాగులు లోడ్ చేయబడినా, విమానాలు రద్దు కావడంతో ఇబ్బంది పడ్డారు.

ఈ సంక్షోభం వల్ల ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది ప్రయాణికులు తమ విమానాలు రద్దు అయిన తర్వాత ప్రత్యామ్నాయ విమానాలు బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు, కానీ ఇతర ఎయిర్‌లైన్స్ టికెట్ ధరలు భారీగా పెరిగాయి. ఉదాహరణకు, హైదరాబాద్ నుండి భోపాల్‌కు సాధారణ టికెట్ ధర రూ.1.03 లక్షలకు చేరుకుంది. కొందరు ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో గొడవలు పడుతున్నారు, ఇండిగో సిబ్బందిని 'అన్‌ప్రొఫెషనల్' అంటూ విమర్శిస్తున్నారు. ఇండిగో డిసెంబర్ 5 నుండి 15 వరకు రద్దు మరియు మార్పులకు వైవర్‌లు అందిస్తోంది, కానీ ప్రయాణికులు రిఫండ్‌లు మరియు ప్రత్యామ్నాయాల కోసం చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది.

ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం మరియు ఇతర సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాయి. స్పైస్‌జెట్ విమాన సంస్థ దేశవ్యాప్తంగా 100 అదనపు విమానాలను అందుబాటులోకి తెచ్చింది, దీని వల్ల ప్రయాణికులు కొంత మేరకు ఉపశమనం పొందుతున్నారు. అదనంగా, రైల్వే శాఖ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ముంబయి, ఢిల్లీ, పుణె, హౌవ్‌డా నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు, మొత్తం 89 ప్రత్యేక రైలు సర్వీసులు వందకు పైగా ట్రిప్పులతో అందుబాటులో ఉన్నాయి. ఇంకా, 37 రైళ్లకు అదనపు కోచ్‌లు జోడించి నడుపుతున్నారు. తెలంగాణ ఆర్టీసీ మరియు జీఎంఆర్ సంస్థలు శంషాబాద్ నుండి చెన్నై, బెంగళూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాయి, దీని వల్ల ప్రయాణికులు రోడ్డు మార్గంలో ప్రయాణించే అవకాశం లభిస్తోంది.

సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంది. రద్దు అయిన విమానాలకు ఆటోమేటిక్ ఫుల్ రిఫండ్‌లు, డిలే అయిన విమానాలకు రిఫ్రెష్‌మెంట్స్, సీనియర్ సిటిజన్స్‌కు స్పెషల్ లాంజ్ యాక్సెస్ మరియు హోటల్ అకామడేషన్ వంటివి ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అలాగే, 24x7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి స్థితిగతులను మానిటర్ చేస్తోంది. షెడ్యూల్స్ మధ్యరాత్రి నుండి స్టెబిలైజ్ అవుతాయని, రెండు రోజుల్లో పూర్తి నార్మల్సీకి చేరుకుంటాయని మినిస్ట్రీ తెలిపింది. ఇండిగో కూడా తమ షెడ్యూల్స్‌ను స్టెబిలైజ్ చేయడానికి ప్రయత్నిస్తోంది, కాన్సలేషన్స్ సంఖ్యను 850 కంటే తగ్గించింది. ఈ సంక్షోభం దేశవ్యాప్త ఏవియేషన్ సెక్టర్‌పై ప్రభావం చూపుతుంది, ప్రభుత్వం మరియు ఎయిర్‌లైన్స్ మధ్య సమన్వయం అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రయాణికులు తమ విమాన స్టేటస్‌ను ముందుగా చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు.





### అమెరికా కాన్సులేట్ రోడ్డుకు

# డొనాల్డ్ ట్రంప్ పేరు

- **గ్లోబల్ సమ్మిట్ వేళ కీలక నిర్ణయాలు**
- **హైదరాబాద్‌లో ట్రంప్, గూగుల్ పేర్లతో వీధులు**
- **విప్రో, మైక్రోసాఫ్ట్ పేర్లపైనా భవిష్యత్తులో పరిశీలన**
- **తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ప్రభుత్వ ప్రకటన**
- **రాష్ట్రాన్ని ఆవిష్కరణల కేంద్రంగా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు చేసింది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ఆదివారం నిర్ణయించింది. ఈ రహదారిని ఇకపై 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా పిలవనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన గురించి కేంద్ర విదేశాంగ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి త్వరలోనే లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నిర్ణయంతో పాటు మరికొన్ని కీలక రహదారులకు కూడా ప్రముఖుల, సంస్థల పేర్లను ఖరారు చేశారు. రావిర్యాల వద్ద నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును, ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డును కలిపే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టనున్నారు. ఇప్పటికే రవిర్యాల వద్ద ఉన్న ఇంటర్‌ఛేంజ్‌కు 'టాటా ఇంటర్‌ఛేంజ్' అని పేరు ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో గూగుల్ నిర్మిస్తున్న భారీ క్యాంపస్ సమీపంలోని రహదారికి 'గూగుల్ స్ట్రీట్' అని నామకరణం చేయనున్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ముఖ్యమైన రోడ్లకు ప్రపంచస్థాయి కార్పొరేషన్ల పేర్లు పెడతామని ప్రకటించారు. దానికి అనుగుణంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తులో 'మైక్రోసాఫ్ట్ రోడ్', 'విప్రో జంక్షన్' వంటి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం నుంచి హైదరాబాద్ సమీపంలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ముందు ఈ ప్రకటనలు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44 దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.



# పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు

**వలిగొండ,డిసెంబర్ 7(సిద్దిపేట పవర్):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని గోపరాజుపల్లి టిఆర్ఎస్ పార్టీ గీత దాటితే పార్టీలో ఉండి వేరే పార్టీకి సపోర్ట్ చేసిన పార్టీ నిర్ణయాలను ధిక్కరించిన ఎంతటి వారైనా పార్టీలో నుండి తొలగించడం లేదా పార్టీ నుండి బహిష్కరించడం ఉంటాయి అని గోపరాజుపల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంగిశెట్టి దేవదాస్ అన్నారు. గ్రామంలో ఎంత పెద్ద నాయకుడైనా పార్టీలైన దాటితే ఉపేక్షించమని అన్నారు.పార్టీకి ద్రోహం చేసిన వారిని కార్యకర్తలే బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ప్రతి కార్యకర్త టిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారు తప్పించుకోలేరు అన్నారు. పార్టీగా అండగా ఉండి గడపగడపకు తిరిగి ఓటు అడగాలని కెసిఆర్ చేసిన సంక్షేమ ఫలాలు చెప్పాలని వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని వివరించాలని అన్నారు.టిఆర్ఎస్ పార్టీని గెలిపించి మన పెద్దలకు బహుమానం ఇవ్వాలని దేవదాసు అన్నారు.



# ప్రజల కోసం ప్రజాసేవకు గ్రామ అభివృద్ధి కోసం సహకరించండి

**సిద్దిపేట, సిద్దిపేట పవర్ డిసెంబర్ 7 ప్రతినిధి**



బట్టు భాస్కర్ రెడ్డి సర్పంచ్ అభ్యర్థిగా అనే నేను సిద్దిపేట జిల్లా సిద్దిపేట మండల పరిధిలో పెద్దలింగారెడ్డిపల్లెలో స్థానిక సర్పంచ్ ఎన్నికల సంగ్రామంలో సామాన్య కుటుంబం నుంచి గ్రామ అభివృద్ధి కోసం అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామంలోని ముఖ్య సమస్యలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేస్తానని హామీలకే పరిమితం కాకుండా తనను గెలిపిస్తే గ్రామానికి అభివృద్ధి వైపు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు సర్పంచ్ అభ్యర్థి బట్టు భాస్కర్ రెడ్డి మాట్లడూతూ గ్రామ అభివృద్ధి కోసం ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రజలతో ఉంటూ ప్రజాస్వామ్యానికి కట్టుబడి గ్రామ రూపురేఖలు మార్చడానికి ప్రజల సమస్యలను నా సాయశక్తుల వరకు తీరుస్తానని, మీరు ఆపదలో సంపదలో పదవి ఉన్నా లేకున్నా మీ తోడు ఉంటానని, మీకోసం మన గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని బ్యాటు గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ బరిలో ఉన్న బట్టు భాస్కర్ రెడ్డి అను నన్ను నా అక్కచెల్లెలు నా అన్నతమ్ముళ్లు వచ్చి బ్యాటు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తారని నమ్మకంతో మీ ఆశీస్సులతో మీలో ఒకడిగా, మీకోసం నిలబడతానన్నారు. నన్ను సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించాగలరని ఆయన తెలిపారు.

# మిరుదొడ్డి గ్రామానికి పునర్ వైభవం తీసుకొస్తాం

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**





సిద్దిపేట జిల్లా మండల కేంద్రంలో మిరుదొడ్డిలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి కానుగంటి స్వప్న శ్రీనివాస్ ప్రచారంలో స్వప్న శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను గ్రామ ప్రజలకు ఇంటింటా ప్రచారంలో భాగంగా గ్రామంలోని డిగ్రీ కళాశాల ముఖ్యంగా మురికి కాలువల విషయంలో వర్షాకాలం వస్తే చాలు వరద నీరు ఇంట్లోకి రావడం జరుగుతుంది అలాగే కొండాపురం అందే గ్రామాలకు వెళ్లే గ్రామంలో వెళ్లే రహదారులు జలదిగ్బంధంలో మునిగిపోవడం జరుగుతుంది. ఈ సమస్యను తాను సర్పంచిగా గెలవగానే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో డిగ్రీ కళాశాల ఉన్న లేనట్టుగానే ఉంది వెంటనే డిగ్రీ కళాశాలలో పునర్ వైభవం తీసుకొస్తాము గ్రామంలో ముఖ్యంగా ఆదివారం వస్తే చాలు కూరగాయల మార్కెట్ సమస్యతో ప్రజలు శతమౌతమవుతున్నారని ఇబ్బందుల పాలవుతున్నారని వాహనాల పార్కింగ్ లేక రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయడం వలన వచ్చే పోయే వాహనాలకు ఇబ్బందితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్ ను సపరేట్గా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తానని మార్కెట్కు వచ్చే విక్రయదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు ఒకసారి కత్తెర గుర్తుకు ఓటు వేసి మమ్మల్ని గెలిపించి మిరుదొడ్డి గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలు సహకరించగలరని కానుగంటి స్వప్న శ్రీనివాస్ ప్రచార కార్యక్రమంలో కమ్మరి స్వామి మొగుళ్ళ మల్లేశం బోయిని చంద్రకుమార్ కానుగంటి కోటి తుమ్మల ప్రశాంత్ భారీ ఎత్తున మహిళలు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు





# సిటీలో క్రిస్మస్ ముందస్తు సెలబ్రేషన్స్..

- **కేక్ మిక్సింగ్..ఫన్ గేమ్స్.. శాంతాక్లాజ్ సందడి**

**సికింద్రాబాద్, డిసెంబర్ 07 ( సిద్దిపేట పవర్ ):**





క్రిస్మస్ ముందస్తు సెలబ్రేషన్స్ సిటీలో ఘనంగా మొదలయ్యాయి. బేగంపేట లోని మ్యారీగోల్డ్ హోటల్ లో క్రిస్మస్ ముందస్తు వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ఈసందర్భంగా నీలిమా వేముల నిర్వహించిన స్పెషల్ ఈవెంట్ లో మహిళలు మెరిశారు. ముఖ్య అతిథిగా బేబక్క, స్పీకర్ గా రజిత హాజరయ్యారు. సుధా నాయుడు, లావణ్య, ప్రణతి లు కేకు మిక్సింగ్ లో పాల్గొన్నారు. శాంతాక్లాజ్ సందడి చేయగా, ఫన్ గేమ్స్ లో మహిళలు సందడి చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ ఆకర్షణగా నిలిచాయి.

# ప్రజల కోసం ప్రజాసేవకు గ్రామ అభివృద్ధి కోసం సహకరించండి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ డిసెంబర్ 7 ప్రతినిధి**



చేపూరి సునీత కిరణ్ గౌడ్ సర్పంచ్ అభ్యర్థిగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలో గంభీర్ పూర్ లో స్థానిక సర్పంచ్ ఎన్నికల సంగ్రామంలో సామాన్య కుటుంబం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి చేపూరి సునీత కిరణ్ గౌడ్ గ్రామ అభివృద్ధి కోసం అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉండే గ్రామంలోని ముఖ్య సమస్యలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేస్తానని హామీలకే పరిమితం కాకుండా తనను గెలిపిస్తే గ్రామానికి అభివృద్ధి వైపు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు గంభీర్ పూర్ గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ అభ్యర్థిగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రజలతో ఉంటూ ప్రజాస్వామ్యానికి కట్టుబడి గ్రామ రూపురేఖలు మార్చడానికి ప్రజల సమస్యలను నా సాయశక్తుల వరకు నెరవేరుస్తానని, మీ ఆపదలో సంపదలో పదవి ఉన్నా లేకున్నా మీ తోడు ఉంటానని, మీకోసం మన గ్రామ అభివృద్ధి కోసం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ బరిలో ఉన్న చేపూరి సునీత కిరణ్ గౌడ్ ను నమ్మకంతో నా అక్కచెల్లెలు నా అన్నతమ్ముళ్లు వచ్చి నన్ను గెలిపిస్తారని నమ్మకంతో ప్రజల ఆశీస్సులతో మీలో ఒకడిగా, మీకోసం నేను ప్రజలు చేపూరి సునీత కిరణ్ భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన తెలిపారు.

# ఆరవ వార్డు సమగ్ర అభివృద్ధి కోసం అవకాశం ఇవ్వండి

- **మద్దెల రాజయ్య**


**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**

సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సర్పంచ్ వార్డు సభ్యుల సంగ్రామంలో పోటాపోటీగా ప్రచారం జోరుగా కొనసాగుతుంది 6 వార్డు అభ్యర్థిగా బీరువా గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని మద్దెల రాజయ్య స్వతంత్ర అభ్యర్థిగా పార్టీలకు అతీతంగా 6 వార్డు అభ్యర్థిగా వార్డు అభివృద్ధి దిశగా అహర్నిశలు వార్డు సభ్యులకు అందుబాటులో ఉండి కష్ట సుఖాలకు అందుబాటులో ఉంటానని ఒకసారి అవకాశం ఇస్తే గ్రామంలోనే ఆరో వార్డును ఉత్తమ వార్డుగా దిశవైపు తీసుకువెళ్తానని మద్దెల రాజయ్య ఆరో వార్డు ప్రజలను కోరారు



# రామకోటి సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామరక్ష స్తోత్ర పుస్తకాల పంపిణి

**దుబ్బాక సిద్దిపేట పవర్ డిసెంబర్ 7 ప్రతినిధి**



రామకోటి రామరాజు సేవలు అమోఘం అని సన్మానించిన దుబ్బాక బాలాజీ దేవాలయ కమిటీ భద్రాచల దేవస్థాన సీతా రాముల కల్యానానికి 2 సార్లు గోటి తలంబ్రాలు అందించిన ఘనత దుబ్బాక భక్తుల ఘనత అని రామకోటి సంస్థ కొనియాడి వారికీ తిరిగి భద్రాచల దేవస్థాన శ్రీరామరక్ష స్తోత్రం పుస్తకాలు, ముత్యాల తలంబ్రాలు ఆదివారం నాడు బాలాజీ దేవాలయంలో అందజేశారు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్బంగా మాట్లాడుతు లోక కల్యాణర్థం శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేయాలన్నారు. శాశ్వతమైన రామనామం ప్రతి ఒక్కరు లిఖించి తరించాలన్నారు. ఈ సందర్బంగా రామకోటి రామరాజును దేవాలయ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 30సంవత్సరాల నుండి రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోగం అన్నారు. మా చేతులతో గోటి తలంబ్రాలు భద్రాచలం అందించి తిరిగి ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి ఇవ్వడం రామకోటి రామరాజు నిశ్వార్థ రామభక్తి అభినందనీయం అన్నారు. ఏమి ఆశించకుండా భక్తుల సేవే భగవంతుని సేవగా భావించి చేస్తున్న సేవలు అందరికీ సాధ్యం కాదని రామకోటి రామరాజుకే సాధ్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అచ్చి లక్ష్మీ నర్సింహా చార్యులు, చింత నాగేందర్, ఇంగు శివకుమార్ ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద గుండవెల్లిశ్రీ రేణుక మాత అమ్మవారిని దర్శించుకున్న హైదరాబాద్ ఉమెన్స్ రంజీ కెప్టెన్ మమత

**దుబ్బాక సిద్దిపేట పవర్ డిసెంబర్ 7 ప్రతినిధి**



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో శ్రీ రేణుక మాత అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న క్రికెటర్ మమత.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాముండేశ్వరినాథ్ ప్రోత్సాహంతో హైదరాబాద్ ఉమెన్స్ రంజి టీంకు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నానని మా బంధువుల మార్గంగా అమ్మవారిని దర్శించుకోవడానికి కుటుంబ సభ్యులతో రావడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఇండియా మెయిన్ టీం కి సెలెక్ట్ అయిన తర్వాత మళ్లీ అమ్మవారి దర్శనానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఢిల్లీ తరపున ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ లో కీపర్ గా బ్యాట్స్మెన్ గా ఆడడానికి సిద్ధమైన మమత, రాబోయే రోజుల్లో ఇండియా టీంకు సెలెక్ట్ అయిన తర్వాత మరింత పేరు తెచ్చే విధంగా రాణిస్తానని కీపర్ మమత ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ రేణుకా మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి చిత్రపటాన్ని బహుమానంగా అందజేసి సన్మానం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, దొడ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..!

**చేర్యాల, డిసెంబర్ 7 (సిద్దిపేట పవర్)**


చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో 1 వ వార్డు అభ్యర్థిగా జంగిటి శ్రీకాంత్ బరిలో నిలుస్తున్నాడు..ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వార్డు లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాను అని తెలిపారు.. మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఆకునూరు గ్రామంలోని మొదటి వార్డు లో తనను గెలిపించాలని వార్డు సభ్యులకు జంగిటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు..



# కెన్యాలో తెలుగు వాళ్ళ పెద్ద మనసు...

- **మొంబాసా సాటర్ డే క్లబ్ ఫండ్ రైజింగ్‌లో ఎన్నారైల ఛారిటీ షో**

**సికింద్రాబాద్, డిసెంబర్ 07 ( సిద్దిపేట పవర్ ) :**



కెన్యా లోని మొంబాసా తెలుగు అసోసియేషన్ ( MOMTA) ఆధ్వర్యంలో ఫండ్ రైజింగ్ కై సాటర్ డే క్లబ్ నిర్వహించిన అసోసియేషన్ సభ్యుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. మొంబాసా లో బోర్ వెల్లుల ఏర్పాటు, విద్యార్థుల విద్యా సహాయం, భారీ నీటి నిల్వ ట్యాంకుల విరాళం, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు ఆర్థిక సాయం, అనాథాశ్రమాలకు ఆహార పంపిణీ వంటి సేవా కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మొంబాసా తెలుగు అసోసియేషన్ చైర్మన్ బి. వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్. వెంకటేశ్వరరావు, విశ్వనాథ్, వరదరాజన్, కృష్ణ సందీప్, హెమన్ షా, హిమేష్, సాత్విక్, లక్షిత్ పాల్గొన్నారు. కార్యక్రమం సాటర్ డే క్లబ్ చైర్మన్ వినోద్ రావు నిర్వహించారు. కెన్యా లోని నిరాశ్రయుల సంక్షేమానికి ఎన్నారై తెలుగు వాళ్ళు ఒకటిగా నిలిచి, ఫండ్ రైజింగ్ కోసం వీకెండ్ లో నిర్వహించిన ఛారిటీ షో పట్ల అంతా అభినందిస్తున్నారు.

## మిరుదొడ్డిలో స్థానిక సర్పంచ్ ఎన్నిక వార్డు సభ్యుల సమరంలో
# 13వ వార్డు యువకునికి ఏకగ్రీవం చేశారు.





**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**

సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డి లో స్థానిక సంస్థల సంగ్రామంలో వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న 13వ వార్డు అభ్యర్థిగా నరేష్ గౌడ్ యువకునికి వార్డు ప్రజలందరూ కలిసి వార్డు అభివృద్ధి కోసం యువకులు అవసరం అని యువ రాజకీయం కోరుకున్న ఆ వార్డు నరేష్ గౌడ్ అనే ఒక యువకుడ్ని ఏకగ్రీవం చేయడం గ్రామానికి ఆదర్శం ఇట్లాంటి కార్యక్రమాలు అన్ని గ్రామాలలో చేసుకుంటే గ్రామ అభివృద్ధికి యువకులు ఎంతో అవసరం నరేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం చూపి నమ్మకంతో నన్ను ఏకగ్రీవంగా 13వ వార్డు సభ్యునిగా చేసుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని 13వ వార్డు ప్రజల మధ్యలో ఉంటూ వారి సేవలో ఉంటానని నరేష్ గౌడ్ తెలిపారు. అనంతరం రేణుకా దేవి ఆలయంలో కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో నరేష్ గౌడ్ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు

# మిరుదొడ్డిలో జోరుగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం..

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**



సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డిలో స్థానిక సంస్థల ఎన్నికల ఎన్నికలు సమరానికి సిద్ధమయ్యాయి. మిరదొడ్డి గ్రామానికి చెందిన ఎలుముల మహేశ్వరి దేవరాజ్ జోరుగా కొనసాగుతున్న ప్రచారంలో భాగంగా మిరుదొడ్డిలో ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎలుముల మహేశ్వరి దేవరాజ్ మాట్లాడుతూ తాను చదువుకున్న వ్యక్తిని కావున ప్రజలందరూ తనను ఆశీర్వదించి తనకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి సేవ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు చదువుకున్న ఆడబిడ్డను గ్రామంలోని సమస్యలని తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఇప్పుడు ఉన్న యువతరానికి అనుకూలంగా గ్రామంలోని సమస్యలను గెలిపించి గ్రామంలో ని సమస్యలు గ్రామంలో ఉన్న డిగ్రీ కళాశాల పునర్ వైభవం తీసుకొస్తానని డిగ్రీ కళాశాల కోసం గ్రామ నుంచి ఎంతమంది ఆడపడుచులు సిద్దిపేటకు వెళ్లి ఇబ్బందుల పాలవుతున్నారని తనకు ఒక అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా నని తెలిపారు ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించవలసిందిగా కోరారు.





# భారత రాజ్యాంగాన్ని పరిరక్షణ కు ఉద్యమించాలి.

- **రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య**

**సిద్దిపేట పవర్ అక్బర్ పేట భూంపల్లి డిసెంబర్ 7**




భారత రాజ్యాంగ పరిరక్షణ కు ఉద్యమించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య అన్నారు.దళిత బహుజన ఫ్రంట్ చేపట్టిన భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమం ఆదివారం నాడు మండల కేందమైన భూంపల్లి అక్బర్ పేట లో జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కివెంకటయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం వల్లనే దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అన్ని రంగాలలో సామాజిక న్యాయం అమలులోకి వచ్చిందన్నారు.సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని జీర్ణించుకోలేని మనువాదులు భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు.డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ 76 వ భారత రాజ్యాంగ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమం చెపట్టమన్నారు.ఈ కార్యక్రమం లో దళిత నాయకులు తాడెం కృష్ణ, జిడిపల్లి రవి,కమటం వెంకటస్వామి,సురేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం డబ్బు తరలిస్తే చర్యలు తప్పవు

- **మిరదొడ్డి ఎస్సై సమత**

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**

సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డి ఎస్సై సమత స్థానిక సంస్థల ఎన్నికల భాగంలో మండల కేంద్రంలోని పలు గ్రామాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ చేయకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు ఎవరైనా చట్ట విరుద్ధంగా మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50 వేలకు మించి డబ్బు కలిగి ఉన్నట్లయితే కేసు నమోదు చేస్తామన్నారు.





# బండి భాగ్యలక్ష్మి దశదినకర్మలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.

**దుబ్బాక సిద్దిపేట పవర్ డిసెంబర్ 7 ప్రతినిధి**





అక్బర్ పేట భూంపల్లి మండలం పోతారెడ్డి పేట గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గీతా పారిశ్రామక సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ బండి నర్సా గౌడ్ . సతీమణి బండి భాగ్యలక్ష్మి దశదిన కర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బండి భాగ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బండి నర్సా గౌడ్ కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాల్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు మంద చంద్ర సాగర్, పాతూరి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు పెరిక మధు, పోతారం అనసూయ ప్రతాప్, టీపీసీసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు ఎల్లన్న గారి కొండల్ రెడ్డి, కూడవల్లి దేవస్థానం డైరెక్టర్ పుర్ధోజి ప్రభాకర్ చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు ఎర్రోళ్ల స్వప్న బాలు, సతీష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బ్యాగరి నవీన్, సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి, బాల్తే వెంకటేశం, కోరంపల్లి యాదవ రెడ్డి, కటికే అశోక్, దేవర మైపాల్, బొమ్మరపు ఎల్లం తదితరులు పాల్గొన్నారు

# మిరదొడ్డి గ్రామ అభివృద్ధి కోసం సేవకురాలుగా పనిచేస్తా.

- **కాసా పుష్ప కిష్టయ్య సర్పంచ్ అభ్యర్థి.**





సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరిదొడ్డిలో కుల మతాలకు అతీతంగా రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు గ్రామ యువకుల వృద్ధుల మహిళల కోసం తోడ్పడుతానని బ్యాటు గుర్తుతో గ్రామ ప్రజలను కోరుతున్నాను బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే గ్రామంలో సమస్యలన్నీ ఎన్నో ఉన్నాయని అవన్నీ నెరవేరుస్తానని కాశ పుష్ప కిష్టయ్య ఈరోజు ఇంటింటికి ప్రచారం చేస్తూ తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు వచ్చే ఎన్నికల్లో ఈసారి బీసీ బిడ్డగా మీ ముందుకు వస్తున్న గ్రామములోని సమస్యలు మహిళలకు వృద్ధులకు ఏ అవసరం వచ్చినా ఇప్పుడు మీ మధ్యలో ఉంటానని ఎల్లప్పుడు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా కాసా పుష్ప కిష్టయ్య తెలిపారు గ్రామంలో ఇంతవరకు స్వచ్ఛందంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాము ఓడిన గెలిచిన మీ మధ్యలోనే ఉంటూ గ్రామంలోని సమస్యలను స్వచ్ఛంద కార్యక్రమాలను ఎవరికి ఆపద వచ్చినా మీ ముందు ఉంటారని సర్పంచ్ అభ్యర్థి కాసా పుష్ప కిష్టయ్య తెలిపారు

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ శ్రీనివాస్

**సిద్దిపేట్ పవర్ మిరుదొడ్డి డిసెంబర్ 7**





సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని ఓ వేడుక మందిరంలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచిన సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఓటరును ప్రలోభాలకు గురి చేస్తే సహించమన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడాలన్నారు. ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు ముందస్తుగా తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జగదీశ్వర్, ఎంపీడీవో గణేష్ రెడ్డి, ఎస్ ఐ సమత, ఉప తహసిల్దారు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి మరింత అభివృద్ధి చేసి చేస్తా

- **అక్కారం బీ ఆర్ యస్ సర్పంచ్ అభ్యర్థి గునిశెట్టి ఆశలత బాల్ చంద్రం**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



గజ్వేల్ మండలం అక్కారం మధిర గ్రామం కోనాపూర్ లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఉంగరం గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేండ్ల బీ ఆర్ యస్ పరిపాలనలో అక్కారం గ్రామం లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రామానికి అభివృద్ధి పథకంలో తీసుకుపోవడం జరిగిందని అక్కారం కోనాపూర్ మధిర గ్రామంలో తాగునిటీ సమస్య ఉన్నా రోడ్ల మరమ్మతులు సిసి రోడ్ల నిర్మాణం డ్రైనేజి నిర్మాణం వంటి పనులను పూర్తి చేయడం జరిగిందనీ అన్నా అంటే ఆపదలో రాత్రిపగలు తేడా లేకుండా పని చేసిన వ్యక్తి నీ ఇప్పుడు మళ్ళీ అవకాశం వచ్చిందనీ కోనాపూర్ ఆదరించిరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని పేర్కొన్నారు. అదేవిధంగా తమ అమూల్యమైనఓటు ఉంగరం గుర్తుకు వేసి దీవించండినీ ఆశీర్వదించండి అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు వి రాంచంద్రం కె యాదగిరి యం పద్మ యం శ్రీకాంత్ ఆర్ శ్యామల వి యాదగిరి యం రజిత డీ కవిత బీ నర్సింలు బీ ఆర్ యస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.